క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా రంజిత్‌కుమార్



నకిరేకల్ : నకిరేకల్ మున్సిపల్ గ్రేడ్–3 కమిషనర్‌గా ఎ.రంజిత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఆర్‌అండ్‌బీ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రంజిత్‌కుమార్ ఇటీవల బదిలీల్లో నకిరేకల్ కమిషనర్‌గా నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషన్ బాలయ్య ఏప్రిల్ 31న పదవీ విరమణ పొందారు. ఆ తరువాత మున్సిపల్ మేనేజర్‌గా ఉన్న అబ్దుల్ రశీద్ ఇన్‌చార్జ్ కమిషన్‌గా బాధ్యతలు చేపట్టారు. అబ్దుల్ రశీద్ నుంచి రంజిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కనగల్ : మండల కేంద్రలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తోకల సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆయా గ్రూపుల్లో చేరే విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డ్రెయినేజీలు నిర్మించాలి

నకిరేకల్ : చందుపట్ల గ్రామంలోని ఒకటో వార్డులో మురుగు కాల్వలు లేకపోవడంతో వీధుల్లో మురుగు నిలిచి దోమల బెడద అధికంగా ఉందని, డ్రెయినేజీ నిర్మించాలని బీజేపీ నాయకుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం వార్డులో మురుగు నీటి దుస్థితిని ఆయన పరిశీలించారు. వార్డులో మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగు నిలిచి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట నాయకులు మునుగోటి నవీన్‌కుమార్, కొల్లు శివ, రాచురి రవి, పుట్ట లక్ష్మయ్య, పుట్ట సురేష్, పుట్ట నర్సమ్మ, జానకమ్మ తదితరులు ఉన్నారు.

2వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు

నల్లగొండ: విద్యుత్ భద్రతా వారోత్సవాలు జూలై 2 వరకు నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు తెలిపారు. నల్లగొండ టౌన్ 1 సెక్షన్ పరిధిలోని గొల్లగూడ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి భద్రతా పనిముట్లు అందజేశారు.

చిట్యాల ఎస్‌ఐగా రవికుమార్



చిట్యాల: చిట్యాల ఎస్‌ఐగా మామిడి రవికుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఆయన సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించే వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

సమ్మె నోటీసు అందజేత

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ రమేష్‌బాబుకు ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును సీఐటీయూ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్, సహాయ కార్యదర్శి ఎస్‌కె.సుబాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి

చిట్యాల: రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను(ఔషదాలు) ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం ఐద్వా సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సరోజ మాట్లాడుతూ షుగర్, బీపీ వంటి మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండడం లేవన్నారు. ఐద్వా మండల అధ్యక్షురాలు రుద్రవరం పార్వతమ్మ, కడకంచి అండాలు, యాదమ్మ, బాలమణి, స్వాతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు: మండలంలోని ఎల్లగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అంజయ్య–జయమ్మ దంపతుల కుమారుడు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి రూ.10వేలతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు చందాలు వేసుకుని మరో రూ.10వేలు మొత్తం రూ.20వేలను సోమవారం అందజేశారు. మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురిగి రవి, లింగస్వామి, మహేష్, శంకరయ్య, లింగస్వామి, పరమేష్, మారయ్య, సైదులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నిలిచిన మిషన్ భగీరథ నీరు

- మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వ్యవసాయ బోరు మోటార్లు, ట్యాంకర్ల నీళ్లే దిక్కు
- నీటి సరఫరా పునరుద్ధరించాలని వేడుకోలు



రాంరెడ్డిపల్లిలో వ్యవసాయ బోరు వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాలకు మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణా జలాలు సరఫరా కాకపోవడంతో ప్రజలు వ్యవసాయ పొలాల వద్ద నీటిని తెచ్చుకుంటున్నారు. మరి కొందరు గ్రామస్తులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

స్వాములవారి లింగోటం వద్ద మరమ్మతులు..

మర్రిగూడ మండల వ్యాప్తంగా 18 గ్రామపంచాయతీలు, 42 ఆవాస ప్రాంతాల్లో 54 మిషన్ భగీరథ నీటి ట్యాంకులు ఉన్నాయి. మిషన్ భగీరథ నీటిని పైప్‌లైన్‌ల ద్వారా ట్యాంకుల్లో నింపి ఆ ట్యాంకుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తారు. మొదటగా నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ద్వారా కోదండాపురం ఇంటెక్వెల్(బావి)నుంచి పైపుల ద్వారా నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటంకు కృష్ణా జలాలను తరలిస్తారు. అక్కడి నుంచి సమీపంలో గల గుట్టమీద మూడు ట్యాంకులకు పైపుల ద్వారా తరలించి అటు నుంచి గ్రామాలకు నీటిని సరఫరా చేస్తారు. శనివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు భగీరథ నీరు మర్రిగూడ మండల వ్యాప్తంగా సరఫరా కాలేదు. నాంపల్లి మండలంలోని స్వాములవారిలింగోటం వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నందున్న నీటి సరఫరా నిలిపివేశామని అధికారులు చెబుతున్నారు. కొత్త మోటార్లను ఏర్పాటు చేయడానికి మరమ్మతులు చేపడుతున్నామని అవి పూర్తయిన వెంటనే నీటి సరఫరా పునరుద్ధరిస్తామని అంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వ్యవసాయ పొలాల వద్ద నుంచి..

మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో భగీరథ నీరు నిలిచిపోవడం, స్థానిక నీరు సరిపడా సరఫరా జరగకపోవడంతో పలువురు మహిళలు సమీపంలో ఉన్న ఓ రైతు వ్యవసాయ పొలం నుంచి రెండు రోజులుగా బిందెలు, బకెట్లు, క్యాన్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటిని సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్‌ల ద్వారా కూడా...

వ్యవసాయ పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చుకునేందుకు వెసులుబాటు కానివారు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ట్యాంకర్‌కు దూరాన్ని బట్టి రూ.500 నుంచి రూ.800 చెల్లించాల్సి వస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తాగడానికి ఫిల్టర్ నీరు కొనుగోలు చేస్తున్నామని, మిషన్ భగీరథ నీటి సరఫరా జరిగితే కొనుగోలు చేయాల్సిన బాధలు తప్పుతున్నాయని అంటున్నారు.

పొలం బోరు నీటిని తెచ్చుకుంటున్నా



మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో దగ్గరలో ఉన్న వ్యవసాయ పొలం వద్ద బోరు నుంచి బిందెల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నాం. ఫ్లోరైడ్ నీటితోనే వంటలు చేసుకోవాల్సి వస్తోంది. మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేసి తాగునీరు సరఫరా చేయాలి.

– లవంగి రేణుక, రాంరెడ్డిపల్లి

మూడు రోజులుగా నీళ్లు రావడం లేదు



మూడు రోజుల నుంచి కృష్ణా నీరు రాకపోవడంతో పొలాల వద్ద నుంచి తెచ్చుకుని నీటిని వాడుకుంటున్నాం. బకెట్లు, బిందెల ద్వారా నీటిని తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు త్వరగా స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– పల్లేటి స్వరూప, రాంరెడ్డిపల్లి

పనులు పూర్తయిన వెంటనే పునరుద్ధరిస్తాం

స్వాములవారిలింగోటం వద్ద ఆదివారం, సోమవారం రెండు రోజులు మోటార్ల మరమ్మతుల పనులు చేపట్టాం. అందుకే గ్రామాలకు తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

– వెంకట్, గ్రిడ్ ఏఈ

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని, ఇంటి స్థలాలు ఉన్న వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో ఇంకా చేపట్టాల్సిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయడంతో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. చిట్యాల మున్సిపాలిటీలో 240, బ్రాహ్మణవెల్లెంలలో 120, ఔరవాణిలో 100, గుండ్రాంపల్లిలో 56 డబుల్ బెడ్ రూం ఇళ్లలో కొద్దిపాటి నిర్మాణ పనులు చేపడితే పూర్తవుతాయని అన్నారు. వీటిని గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేదలకు స్థానికత ఆధారంగా పారదర్శకంగా త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ జి.కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, మాజీ సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, అంతటి వెంకటేష్‌గౌడ్, వనమా వెంకటేశ్వర్లు, బట్టు అయిలేష్, కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, ఇబ్రహీం, బొబ్బల రాంరెడ్డి, పాల శివ, మోహన్, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కట్టంగూర్ : అంబేద్కర్‌నగర్ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.6.56 లక్షలలో మౌలిక వసతుల కల్పన పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య. ఉచితంగా యూనిఫాం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, ఐతగోని నర్సింహ, మర్రి రాజు, మిట్టపల్లి శివ, హెచ్ఎం ఇందిరాదేవి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



కట్టంగూర్ : తంగెళ్ల సునందను సన్మానిస్తున్న సిబ్బంది

కట్టంగూర్ : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని కట్టంగూర్ ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు 42 సంవత్సరాలు ఉత్తమ సేవలందించిన కట్టంగూర్ హైస్కూల్ సోషల్ టీచర్ (ఎస్ఏ)తంగెళ్ల సునంద సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సునంద పదవీ విరమణ సన్మాన, అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం (ఎంఈఓ) అంబటి అంజయ్య, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి ఉపాధ్యాయురాలికి పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయురాలు సునంద కుమారులు ఓంప్రకాశ్‌రెడ్డి–ఇందు, సూర్యప్రకాశ్‌రెడ్డి –మౌనికలు సుమారు రూ.లక్ష విలువ చేసే ఆర్‌ఓ ప్లాంట్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం రంగరాజు జ్యోతి, పున్న రవీందర్, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు కొంక ఆంథోని, చిన్ని శ్రీనివాస్, గఫూర్, మహాలక్ష్మి, నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల మన్ననలు పొందినప్పుడే గుర్తింపు

తిప్పర్తి : ప్రజల మన్ననలు పొందినప్పుడే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు షకీలాబాను పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు షకీలాభానును సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షకీలాబానును సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి

సామాజిక మాధ్యమాలు విద్యా ఉన్నతికి తోడ్పడాలి



ప్రోత్సాహకం అందుకుంటున్న విద్యార్థిని

నకిరేకల్ : సామాజిక మాధ్యమాలు విద్యా ఉన్నతికి తోడ్పడాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య సూచించారు. ప్రపంచ సామాజిక మాధ్యమ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వినోదం నిడివి తగ్గించి విద్యకు, విజ్ఞానానికి మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ శ్రీనివాసాచారి, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, నర్సింహాచారి, ఉపేందర్, శివశంకర్, శ్రీను, సిబ్బంది వెంకన్న, సయ్యద్, సుదర్శన్, కార్తీక్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవీందర్

కట్టంగూర్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కట్టంగూర్ ఎస్‌ఐ ఎం.రవీందర్ అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని మల్లారం గ్రామంలో పౌర హక్కులపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మన్నెం వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామనర్సింహారెడ్డికి మాజీ మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన కర్నాటి రామనర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందాడు. కాగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం గ్రామంలో రామనర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఉప్పల వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డిలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నలగాటి ప్రసన్న రాజ్, పొన్నం లక్ష్మయ్యగౌడ్, మేడి ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అంత్యక్రియలు



బాలసుధాకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

కేతేపల్లి: ఇనుపాముల గ్రామానికి చెందిన సుస్మిల, కేతేపల్లికి చెందిన బందా బాలసుధాకర్ ఆదివారం బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలోని ఓ రిసార్టులో ఆదివారం పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నారు. వారిద్దరి మృతదేహాలకు సోమవారం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను సాయంత్రం స్వగ్రామాలకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

నకిరేకల్: మున్సిపాలిటీలోని 20వ వార్డు ముత్యాలమ్మ ఆలయ సమీప కాలనీలో విద్యుత్ లో వోల్టేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యుత్ లైన్ మార్చే పనులను సోమవారం నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ లైన్ వేయడం ద్వారా లోవోల్టేజీ సమస్యలు తొలగనున్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చౌగోని రాములమ్మ సైదులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నకిరేకల్ : ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 18వ వార్డు వడ్డెర బస్తీలో సోమవారం స్థానిక కౌన్సిలర్ దైద స్వప్నతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీలో విద్యుత్ లో వోల్టేజీ సమస్య ఉందని కాలనీ ప్రజలు వారికి వివరించారు. ఈ విషయాన్ని వారు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు వెంటనే విద్యుత్ లైన్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పందిరి సతీష్, రూపని భిక్షం, చెనగాని రాజశేఖర్, వంటిపాక యాదగిరి, మల్లేష్, వరికుప్పల కృష్ణ, నర్సింగ్ మహేష్, వంటిపాక నక్షత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి, మర్రిగూడ, దామెరభీమనపల్లి రైతువేదికల్లో మంగళవారం చిరు ధాన్యాల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఓ సాహస్ సోమవారం తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోని రైతులు రైతు వేదికల వద్ద రిజిస్ట్రీ చేయించుకోవాలని కోరారు.

పాల సంఘం చైర్మన్ల ఎన్నిక

చిట్యాల: మండలంలోని ఎలికట్టె, వెలిమినేడు గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మన్లను సోమవారం ఎన్నుకున్నారు. వెలిమినేడు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా మారగోని యాదయ్యయాదవ్, ఎలికట్టె చైర్మన్‌గా గుత్తా యాదగిరిరెడ్డి ఎన్నికయ్యారు.

క్రిస్టియన్ సంఘాలకు అండగా ప్రభుత్వం

రామగిరి(నల్లగొండ): క్రిస్టియన్ సంఘం సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. నల్లగొండ మరియగిరి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవరెండ్ ఫ్రాన్సిస్ ధనరాజ్ ఆధ్వర్యంలో సోమవాం క్రిస్టియన్ కార్పొరేషన్ సభ్యులు దీపక్ జాన్‌ను హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సంఘం సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎక్స్ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, రెడ్డిమాస్, చార్లెస్, కామినేని జయరాజ్, బొజ్జ ఆరోగ్యం ఉన్నారు.



దీపక్ జాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తయ్యేనా!



మునుగోడులో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనం

మునుగోడు: ప్రతి ఒక నియోజకవర్గ కేంద్రంలో అన్ని హంగులతో కూడిన అంబేద్కర్ భవనం నిర్మించేందుకు గత ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో భవనానికి రూ.కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా మునుగోడులో అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే 2019 అక్టోబర్ మాసంలో శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ భవనం నిర్మాణానికి షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ నుంచి 2018 సంవత్సరం సెప్టెంబర్ మాసంలో రూ.కోటి కేటాయించారు. ఆ నిధులతో 3 గుంటల స్థలంలో 79 ఫీట్ల పొడవు, 35 ఫీట్ల వెడల్పుతో భవన నిర్మాణం చేపట్టేందుకు 2020లో పునాది పనులు ప్రారంభించారు. కానీ నేటికీ పనులు పూర్తిచేయకపోయారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేయాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ సన్నిరాజు

తిప్పర్తి : రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తిప్పర్తి ఏఓ బి.సన్నిరాజు దుకాణదారులక సూచించారు. సోమవారం తిప్పర్తి మండలంలోని పజ్జూరు గ్రామంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాలను అధిక ధరకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆధార్ కార్డు తీసుకెళ్లి ఎరువులను కొనుగోలు చేయాలన్నారు.

జర్నలిస్ట్ స్వేచ్ఛకు నివాళి

చిట్యాల: ప్రముఖ జర్నలిస్ట్ స్వేచ్ఛకు చిట్యాలలో టీయూడబ్ల్యూజే (హెచ్–143) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మూడ వేణు, జిట్ట నగేష్, మండల అధ్యక్షుడు కారంపూడి మధు, నియోజకవర్గ కార్యదర్శులు బొడిగె విజయ్‌కుమార్‌గౌడ్, గుండ్లపల్లి వెంకన్న, మండల కోశాధికారి చెన్నోజు చంద్రశేఖర్, సాంస్కృతిక కార్యదర్శి వెంకట్రాది, కొమిడాల మహేందర్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవం చేశారని ఫిర్యాదు

చిట్యాల: వెలిమినేడు గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార ఎన్నికల్లో భాగంగా డైరెక్టర్లు, చైర్మన్ల ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా ఎన్నికైట్లు ప్రకటించుకుంటున్నారని ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం చిట్యాల పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. డైరెక్టర్ల, చైర్మన్ల నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ రద్దుకు బీజేపీ కుట్ర

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి రిజర్వేషన్ రద్దుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇంచార్జి బొలుగురి నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వల్లంపట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, సీపీఐ మండల కార్యదర్శి రామలింగయ్య, దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్, లింగానాయక్, సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

ఫీజులు తగ్గించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మునుగోడు: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని అధిక ఫీజులు నియంత్రించాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ మల్లేషంకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లోనే నోట్‌పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయించి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు గోపగోని ఉదయ్, నాగరాజు, శివ తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రితో విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ కలిగిన క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాచారి, ఎస్ఎంసీ చైర్మన్ కళ్యాణి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు, దునుక వెంకన్న, దామెర్ల శ్రీనివాస్, గుండు పరమేశ్, రాపాక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయం పరిశీలన

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ పరిధిలో గల శ్రీ భూసమేత తిరుమలనాథ స్వామి ఆలయాన్ని సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర ధార్మిక పరిషత్ ప్రత్యేక సలహాదారు గోవిందహరి పరిశీలించారు. ఆలయంలో మౌలిక వసతుల కల్పనతోపాటు ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్లానింగ్‌పై చర్చించారు. వారివెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య, ఏనుగు రఘుమారెడ్డి, అంతటి వెంకటేష్‌గౌడ్, గోలి గణేశ్ ఉన్నారు.